





'అవ్వారు'కు జాతీయ పురస్కారం



ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :మండలంలోని కప్పలదొడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ప్రముఖ కవి అవ్వారు శ్రీధర్ బాబుకు జాతీయ పురస్కారం లభించింది. వివరాల మేరకు...పెన్నా రచయితల సంఘం అధ్యక్షులుగా సాహిత్య సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీధర్ బాబు రచించిన "ఎగరుతున్న పద్యం" కవితా సంపుటికి ఇండో జాతీయ పురస్కారం–2023 లభించింది. ఈ మేరకు బెంగళూరులో ఐఎస్ఒ గుర్తింపు పొందిన కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య చైర్మన్ బి. మాల్యాద్రి ప్రధాన కార్యదర్శి కె. వెంకటేశ్వర శాస్త్రి నుండి ఉగాది పురస్కార ప్రధాన ఉత్సవ ఆహ్వానం రచయిత అవ్వారు శ్రీధర్ బాబుకు పంపించారు. ఈ మేరకు ఈ నెల 19వ తేదీన బెంగళూరులోని కళ్యాణ నగర్ ఇండో ఏషియన్ అకాడమీలో జరిగే సాహిత్య సభలో ఈ పురస్కారాన్ని శ్రీధర్ బాబు అందుకోనున్నారు.ఉగాది పురస్కారానికి ఎంపికైన అవ్వారు శ్రీధర్ బాబుకి అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు..!

ఇంటర్

ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు నేటి నుంచి జరగనున్నాయి. అందుకు సంబంధించి అధికారులు పక్కా ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాపితంగా 95 పరీక్ష కేంద్రాల్లో 55,909 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఉదయం 9నుంచి 12గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. 8.30 గంటలకే పరీక్ష హాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారు. ఒక్క నిముషం ఆలస్యమైనా అనుమతి ఇవ్వడం జరగదని ఆర్ఐఓ వరప్రసాద్ తెలిపారు. పరీక్షలకు సంబంధించి ఎస్‌పి విజయారావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని కేంద్రాల వద్ద 144 విధించారు.

- నిముషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- 55,909 మంది విద్యార్థులు హాజరు
- 95 కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 26,060 మంది, వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులు 1575 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థుల 26,705 మంది, వృత్తి విద్యా కోర్సు విద్యార్థులు 1599 మంది హాజరుకానున్నారు. రోజు మార్చి రోజు పరీక్షలు నిర్వహించ నున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు జంబ్లింగ్ విధానం అమలు చేయనున్నారు. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రాలకు తీసుకురావద్దని అధి కారులు తెలిపారు. స్మార్ట్ వాచ్‌లు, అనుమతించరు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయ నున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్ షాపులను మూసివేశారు.



పోలీసుల భద్రత మధ్య పరీక్ష పత్రాలు తీసుకెళ్లనున్నారు. ఎక్కడా అలసత్వం జరగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆర్ఐఓ వరప్రసాద్ పరీక్ష కేంద్రాలను పరిశీలించి సూచనలు చేశారు. వేసవి కాలం కావడంతో విద్యార్థులకు మంచి నీటి వసతి కల్పించాలని ఆదేశించారు. ఎస్‌పి విజయారావు మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యార్థులకు ఇబ్బందు ల్లేకుండా చూడాలని సూచించారు. జిల్లా వ్యాపితంగా ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్ అధికారులు తెలిపారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకటరమణ

సెల్ టవర్ బ్యాటరీ దొంగలు అరెస్ట్

ప్రజాశక్తి - కావలి:కావలి డిఎస్‌పి పరిధిలో సెల్‌ఫోన్ టవర్లకు ఉపయోగించే బ్యాటరీల దొంగలు ఐదుగురిని మంగళవారం కావలి రూరల్ సి.ఐ.రాజేష్, ఎస్.ఐ. వెంకట్రావు, వారి సిబ్బంది అరెస్ట్ చేసి వారి నుంచి రూ.7,40,000 విలువైన 100 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నట్లు కావలి డిఎస్‌పి వెంకటరమణ తెలిపారు. కావలి రూరల్ పోలీసుస్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నిందితులు దార్ల తిరుపతి, దార్ల శీను, మరొక దార్ల శీను, పర్తాపు కళ్యాణం, దార్ల చిన్నలు కావలి డిఎస్‌పి పరిధిలోని కావలి రూరల్, బిట్రగుంట, ఎస్.ఆర్.పురం, కోవూరు, దగదర్తి, కొడవలూరు, జలదంకి పోలీసు స్టేషన్ల పరిధులలో జరిగిన 11 దొంగతనాలలో పాల్గొన్నారని తెలిపారు. వీరు రాత్రి వేళల్లోఆటోలో తిరుగుతూ సెల్‌టవర్‌ల వద్దటవర్ రూమ్‌ల తాళాలను పగులగొట్టి, అందులో ఉన్న బ్యాటరీలను దొంగిలిస్తున్నారని తెలిపారు. వారినుండి 100బ్యాటరీలను, ఆటో, టూల్‌కిట్, బైక్, గ్లాస్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరుగాక దార్లమహేష్, పర్తాపు అల్లూరయ్య, అనే ఇద్దరు దొంగలు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-నెల్లూరు

హైదరాబాదులో 11 నుండి 12 వరకు జరిగిన నాలుగవ ఆల్ ఇండియన్ సౌత్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో నెల్లూరు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో చదువుతున్న వేమిరెడ్డి సాయినిశిత చెస్‌లో, టి.కుసుమ వాలీబాల్‌లో మొదటి బహుమతులు సాధించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ వి.విజయ్ కుమార్, డిసిఎంఇ హెడ్ ఆఫ్ సెక్షన్ పి.పాపమ్మ, డిఇసిఇ హెడ్ ఆఫ్ సెక్షన్ ఎస్‌కె.అహ్మద్, ఫిజికల్ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు, కళాశాల సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

15నుంచి నిరసన దీక్షలు

ప్రజాశక్తి-కందుకూరు

అగ్రిగోల్డ్ బాధితులకు సిఎం ఇచ్చిన హామీలు అమలు కోరుతూ ఈనెల 15,16,17 తేదీల్లో విజయవాడలో జరుగనున్న నిరసన దీక్షలు విజయవంతం చేయాలని అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకులు బోయపాటి శ్రీను, సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్ బాబు కోరారు. మంగళవారం కందుకూరు కోటారెడ్డి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సురేష్ బాబు మాట్లాడారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలో అగ్రిగోల్డ్ బాధితులకు పూర్తి డిపాజిట్ల సొమ్ము చెల్లించి సంపూర్ణ న్యాయం చేస్తామని వాగ్దానం చేసిన సిఎం అధికారం చేపట్టి మూడున్నర సంవత్సరాల కాలం గడుస్తున్నా ఇప్పటికీ న్యాయం చేయలేక పోయారని ఎద్దేవా చేశారు. అధికారమే ధ్యేయంగా అగ్రిగోల్డ్ బాధితులకు వాగ్దానాలు గుప్పించిన సిఎం వాటిని అమలు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో గద్దె దించడం ఖాయమని హెచ్చరించారు. అగ్రిగోల్డ్ ఆస్తులను అమ్మి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అగ్రిగోల్డ్ ఆస్తులను అగ్రిగోల్డ్ యాజమాన్యం గుట్టు చప్పుడు లేకుండా అమ్మకాలు చేస్తుంటే సిఎం చోద్యం చూస్తున్నారన్నారు. చనిపోయిన కుటుంబాలకు కనీసం ఎక్స్ గ్రేషియో చెల్లించడం లేదన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

పదివేలు, ఇరవై వేల రూపాయల లోపు డిపాజిట్ దారులకు వారి డిపాజిట్ల సొమ్ము చెల్లిస్తామని చెప్పిన సిఎం వారికి పూర్తి స్థాయిలో చెల్లించ లేదన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేసి బాధితులకు పూర్తి న్యాయం చేయాలని కోరుతూ అగ్రిగోల్డ్ కష్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఈనెల 15, 16, 17 తేదీల్లో జరుగనున్న నిరసన దీక్షలు, 17న సత్యాగ్రహంలో ఏజెంట్స్‌తో పాటు కష్టమర్స్ కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని కోరారు. సమావేశంలో నాయకులు బెజవాడ సుబ్బారావు, కొత్తూరి వెంకటేశ్వర్లు, అత్తంటి శివకష్ణ, దొడ్డప నేని రమేష్ బాబు, కల శెట్టి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

'చలో మచిలీపట్నం'కు తరలిన నాయకులు

ప్రజాశక్తి-కావలి

పట్టణంలోని రైతుబజార్ వద్ద నుంచి జనసేన కావలి నియోజక ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం 200 మంది జనసైనికులు మచిలీపట్నంలో జరిగే జనసేన 10వ ఆవిర్భావ దినోత్సవ బహిరంగ సభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి సమ్మను వెంకటసుబ్బయ్య, పొబ్బ సాయి, రిషికేష్, సుధీర్ మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు కావలి నుంచి 200 మంది కార్యకర్తలు మచిలీపట్నం బయల్దేరుతున్నామని పవన్ సభలకు ప్రజలు స్వచ్ఛందంగా తరలి వస్తున్నారని, 2024వ సంవత్సరంలో జరగబోవు సాధారణ ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి అవుతారని



తెలిపారు. రాష్ట్ర ప్రజలు పవన్ కళ్యాణ్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో అల్లూరు మండల అధ్యక్షుడు, రూరల్ ఇన్‌ఛార్జి వెంకయ్య, దగదర్తి మండల ఆధ్యక్షుడు జనసేన నాయకులు నాగార్జున, అలాశ్రీనాథ్, మస్తాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

3నుంచి 'పది' పరీక్షలు..!

..పక్కా ఏర్పాట్లు చేయండి
కలెక్టర్ చక్రధర్‌బాబు

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

ఏప్రిల్ 3నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బంధీగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ కె.వి.ఎన్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పదో తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ రామారావు జిల్లాలో పరీక్షల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబు మాట్లాడుతూ జిల్లాలో 172 పరీక్షా కేంద్రాల్లో 29,401 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఏప్రిల్ మూడో తేదీ నుంచి 18 తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రూట్ ఆఫీసర్లు ముందుగానే అన్ని పరీక్షా కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించి చెక్ లిస్ట్ ప్రకారం అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా పరీక్షా కేంద్రాల్లో ఏ ఒక్క



కలెక్టర్ చక్రధర్‌బాబు

విద్యార్థికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు సమకూర్చాలన్నారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, కుర్చీలు వంటి వసతులపై ప్రత్యేక దష్టి పెట్టాల న్నారు. విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రవాణా సౌకర్యాలు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జెరాక్స్ షాపులను మూసివేసి 144 సెక్షన్‌ను అమలు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసేందుకు 10 ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలను, 18 మంది రూట్ ఆఫీసర్లను, 18 మంది అదనపు రూట్ ఆఫీసర్లను, పరీక్షా కేంద్రాల్లో పర్యవేక్షణకు 172 మంది చీఫ్ సూపరింటెండెంట్ లను, 172 మంది డిపార్ట్మెంటల్ ఆఫీసర్లను నియమించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పదో తరగతి సంబంధించి 1207 మంది విద్యార్థులు, 3090 మంది ఇంటర్ విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వారు నిర్వహించే ఈ పరీక్షలకు హాజరుకానున్నారని, వీరికి 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 18వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ చిరంజీవి, ఆర్ఐఒ వరప్రసాద్, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి-నెల్లూరు

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో సజావుగా ,ప్రశాంత వాతావరణంలో ఎగ్జామ్స్ నిర్వహించేందుకు పగడ్బందీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌పి సిహెచ్ విజయారావు తెలిపారు. మంగళవారం నగరంలోని ఎస్‌పి కార్యాలయం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షల దృష్ట్యా భద్రతపై జిల్లా పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ పరీక్షలు నిర్వహించేందుకు 95 సెంటర్ల విద్యాశాఖ సిద్ధం చేసిందన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాలల్లోకి విద్యార్థులను ఉదయం 8.30 నుండి 9.00 గంటల వరకు మాత్రమే అనుమతిస్తారు. 9 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించబోరని, దయచేసి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించి నిర్ణీత సమయంలోగా హాజరు కావాలన్నారు. పరీక్షా పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్స్ నుంచి పరీక్ష పేపర్లు కేంద్రాలకు తరలించుట, సమాధాన పత్రాలు తరలించే వరకు అధికారులను సమన్వయం చేసుకొని పోలీసులు తమ విధులను నిర్వహిస్తారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని పోలీసు సిబ్బందికి సూచించామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతరులు ఎట్టి పరిస్థితుల్లో గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఎలాంటి స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్స్, ఐపాడ్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు వెంట తీసుకెళ్లేందుకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. అంతే కాకుండా పరీక్షలు జరిగినన్ని రోజులూ, పరీక్షా సమయంలో ఆయ కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులతో పాటు పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వహించే అన్ని శాఖల సిబ్బందికి కూడా మొబైల్ ఫోన్స్, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి లేదన్నారు. పరీక్షలను సజావుగా, ప్రశాంత వాతారణంలో నిర్వహించేందుకు అన్ని విభాగాల సమన్వయముతో పరీక్షా కేంద్రాలు సందర్శించి కనీస సౌకర్యాలు,సిసి కెమెరాలు ఉండేలా ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం లేకుండా ఉండేలా సంబంధిత పోలీసు అధికారులకు తగు సూచనలు.ఎవరైనా చిట్టీలు, మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ కు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్‌పి విజయారావు

ఇష్టంతో కష్టపడి చదవాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు:విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదవాలని సహాయ సంక్షేమ అధికారి కె. ప్రసూన సూచించారు. మంగళవారం ఆమె మండలం ఇస్కపాలెంలోని ప్రభుత్వ బి.సి బాలుర వసతి గహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రసూన హాస్టల్ లోని పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ఏప్రిల్‌లో జరుగు పబ్లిక్ పరీక్షలలో అందరూ ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులు చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.విద్యార్థుల చదువులు, ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రసూన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహారావును ఆదేశించారు. అనంతరం ఆమె హాస్టల్లో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను, మౌలిక వసతులను పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు, మెనూ సక్రమంగా అమలు చేయవలసిందిగా ప్రసూన హెచ్.డ.బ్ల్యూఒకు సూచించారు. కార్యక్రమంలో వసతి గహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంక్షేమ అధికారి కె. ప్రసూన

తూర్పు ప్రాంత హబ్ ఏర్పాటు చేస్తున్నారా..!
పార్లమెంట్‌లో వేమిరెడ్డి ప్రశ్న

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఎపిలో తూర్పు తీరంలో ట్రాన్స్ షిఫ్‌మెంట్ హబ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందా అని పార్లమెంట్‌లో రాజ్య సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. విదేశీ మారకం పొందడంలో సహాయం, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ఉపాధి కల్పన మొదలైన వాటిని పెంపొందించుకునేందుకు ట్రాన్స్‌షిప్‌మెంట్ సౌకర్యాలను అభివద్ధి చేయాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నదా వాటి వివరాలు తూర్పు వైపున ఆంధ్రప్రదేశ్ భారీ తీరప్రాంతాన్ని దష్టిలో ఉంచుకుని, ప్రభుత్వ యాక్ట్ ఈస్ట్ పాలసీ దష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు తీరంలో ట్రాన్స్ షిప్‌మెంట్ హబ్‌ను ప్రభుత్వం అభివద్ధి చేస్తుందా, వాటి వివరాలను తెలుపమని ప్రశ్నించారు. అందుకుగాను స్పందించిన కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్, ప్రస్తుతం కొచ్చిన్‌లోని ఇంటర్నేషనల్ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్ పనిచేస్తోంది.



రాజసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్ ప్రాజెక్ట్, గలాథియాలోని గ్రేట్ నికోబార్ దీవులలో భారత ప్రభుత్వంచే అభివద్ధి చేయబడుతోందని తెలిపారు. ఇది ఫారెక్స్‌ను ఆదా చేయడంలో, విదేశీ పోర్ట్‌లలో ట్రాన్స్‌షిప్‌మెంట్ కారణంగా నష్టపోవడం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రోత్సహించడం, కార్యాచరణ సామర్థ్యాలను మెరుగుపరచడం ఉపాధి కల్పనకు తోడ్పడుతుందని తెలిపినట్లు విపిఆర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం, ఆంధ్రప్రదేశ్ తూర్పు తీరంలో ట్రాన్స్‌షిప్‌మెంట్ హబ్ అభివద్ధికి ప్రతిపాదన లేదన్నారు. గలాథియా బే వద్దనున్న అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్ ప్రాజెక్ట్ తూర్పు తీరానికి ట్రాన్స్‌షిప్‌మెంట్ హబ్ గా పనిచేస్తుందని తెలిపారు. బొగ్గు సరఫరా కొరత దష్ట్యా, ఈ వేసవిలో విద్యుత్ రంగానికి బొగ్గు కొరత ఏర్పడే అవకాశం ఉందా అని మరో ప్రశ్న వేశారు. ఆంధ్రప్రదేశ్‌తో సహా అన్ని పవర్ ప్లాంట్‌లలో బఫర్ స్టాక్‌లను నిర్ధారించడానికి మంత్రిత్వ శాఖ తీసుకుంటున్న చర్యల వివరాలు తెలిపారు. బొగ్గు కొరతను తీర్చడానికి, 150 మిలియన్ టన్నుల బొగ్గును దిగుమతి చేసుకోవాలని యోచిస్తోందని తెలిపారు. కంపెనీలు వినియోగించుకున్న బొగ్గులో 10 శాతం దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతించిందా అని అడిగారు. థర్మల్ పవర్ కంపెనీలు 10 శాతం శ్లాబును 25 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తున్నాయా అని అడిగారు. దీనికి సంబంధించి ఏదైనా నిర్ణయం తీసుకున్నారా బొగ్గు దిగుమతులపై రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రభావం గురించి తెలుపమని ప్రశ్నించారు. అందుకుగాను స్పందించిన కేంద్రమంత్రి శ్రీ ఆర్.కె.సింగ్ గారు, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ దేశంలోని బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్ల బొగ్గు స్టాక్ స్థితిని రోజువారీగా పర్యవేక్షిస్తుందని తెలిపారు.

పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-సైదాపురం:రైతు భరోసా కేంద్రాలలో రైతులు తాముసాగు చేసుకుంటున్న పంటలను నమోదు చేసుకుంటే ప్రభుత్వ అందచేసే రాయితీలు, ఎరువులు తదితరాలు అన్ని రైతులకు అందుతాయని వ్యవసాయ శాఖాధికారిణి హైమావతి తెలిపారు. ఆర్‌బిసి వద్ద జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్క రైతు పంటలను తప్పక నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద, వైస్ సర్పంచ్ శివ, పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు చర్యలు చేపట్టాలి



పిల్లలకు మాత్రలు మింగిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు



టిపి గూడూరులో



నెల్లూరు రూరల్‌లో

ప్రజాశక్తి-నెల్లూరు

నులిపురుగుల నివారణకు చర్యలు చేపట్టడం ద్వారా పిల్లల ఆరోగ్యం మెరుగుపడుతుందని కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని దర్గామిట్ట సమీపంలోని డిసిఆర్ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలనకు 1–19 సంవత్సరాల వయసులోపు ఉన్న పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవా లన్నారు. విద్యార్థులచే చేతులను శుభ్రం చేసుకునే విధానం వివరించారు. 19 సంవత్సరాల వయసు లోపు ఉన్న పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వలన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోకుండా పిల్లల్లో రక్త హీనత నివారణకు దోహదపడు తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా వున్న అన్నీ స్కూల్స్ లోనూ, అంగన్వాడీ కేంద్రాల్లోని 5.30 లక్షల మంది పిల్లలకు ఈ కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్నట్లు తెలిపారు. జాతీయ వ్యాప్తంగా పోలియో నిర్మూలనకు ఏవిధమైన కార్యక్రమాలను నిర్వహిస్తామో అదే విధంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖల ఆధ్వర్యంలో నులి పురుగులు నివారణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో విద్య, వైద్య ప్రమాణాల్లో జిల్లా ముందంజలో ఉందని, రానున్న రోజుల్లో సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేసి బడికి దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్య పరంగా ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను, సదుపాయాలను విద్యార్థులందరు సద్వినియోగం చేసుకొని మంచి పౌరులుగా ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ, పిల్లలు నులి పురుగుల బారిన పడకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ ఆర్నెల్లకోసారి డీవార్మింగ్ డే నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష ఏపిసి ఉషారాణి, విద్యా శాఖ ఏడి నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయమ్మ, డాక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కందుకూరు



కందుకూరులో

వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రియంవద అన్నారు. మాచవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో పాల్గొన్న ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బాలభాలికల్లో రక్తహీనత నివారించడం కోసం ఆరోగ్యవంతమైన భవిష్యత్తు సమాజాన్ని నిర్మించడం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమంలో 19 సంవత్సరాల్లో వయస్సు కలిగిన బాల బాలికల్లో సంవత్సరానికి రెండుసార్లు నులిపురుగుల మాత్రలు మింగడం మంచిదని చెప్పారు. తద్వారా నులుపురుగుల వలన పిల్లలను ఏర్పడే రక్తహీనతను నివారించుకోని ఆరోగ్యవంతమైన భవిష్యత్తుతో పొందవచ్చు అని చెప్పారు. 19 సంవత్సరాల లోపు వయసు కలిగిన ప్రతి ఒక్కరూ నులుపురుగుల మాత్రలు ప్రతి సంవత్సరం రెండుసార్లు వాడుకోవడం వలన మంచిదని సూచించారు. కార్యక్రమంలో మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కెపి స్వాతి, డాక్టర్ జువేరియా, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు

మండలంలో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం (నేషనల్ డీవార్మింగ్ డే) ఘనంగా జరిగింది. సౌత్ ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు షేక్. అహ్మద్ బాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సౌత్ ఆములూరు ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎం.ఎల్ .హెచ్ .పి సిహెచ్. అరుణ మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అహ్మద్ బాషా, ఎ.ఎన్.ఎం కె.శారదమ్మ, ఉపాధ్యాయులు ఎ.సుభాషిణి, కె.వసంత లక్ష్మి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.


సైదాపురం

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నులిపురుగుల నిర్మూలన కోసం నులిపురుగుల పంపిణీ కార్యక్రమంచేశామని వైద్యాధికారి జనార్ధన్ తెలిపారు. మంగళవారం వేయించుకొని వారు రేపు, ఎల్లుండి వేయడం జరుగుతుందని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లూరు

కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాల లో మంగళవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ ఎ. అంకమ్మ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం,బయట తిరిగేటప్పుడు బూట్లు లేదా చెప్పులు ధరించడం, మరుగుదొడ్డి వాడిన తరువాత ఏదైనా తినక ముందు చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవడం తదితర మంచి అలవాట్లు అందరూ పాటించాలి. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యా యుడు యం భాస్కర్ రావు మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. కావున పిల్లలు చిన్నప్పటి నుంచి ఆరోగ్యం పై అవగాహన కలిగివుం డాలి. గోళ్ళు చిన్నవిగా, శుభ్రంగా ఉంచుకోవాలి, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకూడదు ఎప్పుడూ మరుగుదొడ్డిని ఉపయోగించడం . కూరగాయలు, పండ్లు శుభ్రంగా కడుక్కోవాలి మొదలైన మంచి అలవాట్లు పిల్లలు చిన్నప్పటి నుంచి తప్పకుండా అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు అల్బెండజోల్ 400 మి గ్రా మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరీష్, సంధ్యారాణి, హెల్త్ సెక్రటరీ మిరియమ్మ, విద్యా వాలంటీర్లు వినీత, రాశి, ఆశా వాలంటీర్లు సుజాత,స్వాతి పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన


పాల్గొన్న రాజ్యసభ సభ్యులు బీదమస్తాన్


ప్రజాశక్తి-కావలి
న్యూఢిల్లీలో ఎ.పి.ఇ.డి.ఎ., పి.బి.ఎఫ్.ఐ.ఎ. ఇతర ఏజెన్సీలతో మంగళవారం నిర్వహించబడిన "డాన్ ఆఫ్ ప్లాంట్-బేస్డ్ ఏజ్" అనే కాన్ఫరెన్స్‌లో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన కీలక ఉపన్యాసం చేస్తూ, 'ప్రధానంగా జంతువుల ఆధారిత పదార్థాలు లేదా ఆహార పదార్థాల (ప్రోటీన్) స్థానంలో వినూత్నమైన మొక్కల ఆధారిత ఆహార (ప్రోటీన్) ఉత్పత్తులను రూపొందిస్తున్న వ్యాపార సంస్థలకు తగిన మద్దతు ఇవ్వవలసిన అవసరం ఉందన్నారు. భారతదేశంలోని మొక్కల ఆధారిత ఆహార (ప్రోటీన్) పరిశ్రమ కోసం వృద్ధి చెందుతున్న మార్కెట్‌ను పెంపొందించడం, మొక్కల ఆధారిత ఆహార పరిశ్రమలో ముడి పదార్థాల కొరతను పరిష్కరించడం, ఆహార భద్రత లేబులింగ్, ప్రాధాన్యతల కోసం వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకోవడం మొదలగు అంశాలు మొక్కల ఆధారిత ప్రోటీన్ల తయారీలో కీలకమైనవని తెలియజేశారు. చికెన్, రొయ్యలు లేదా మాంసాన్ని ఉత్పత్తి చేయడానికి అవసరమైన ఇన్‌పుట్‌లు చాలా ఎక్కువ కేలరీలను వినియోగిస్తాయని, సహజంగానే ఉత్పత్తి ఖర్చు కూడా చాలా ఎక్కువగా ఉంటుందని తెలియజేశారు. జంతువుల ద్వారా ప్రోటీన్ ఉత్పత్తిలో ఎక్కువ మొత్తంలో గ్రీన్‌హౌస్ వాయువులను కలిగిస్తుందని, భారతదేశం నుండి వెలువడే మీథేన్ ఉద్గారాలు కూడా గ్లోబల్ ర్యాంకింగ్‌లో చాలా ఎక్కువన్నారు. తాను గత 30 సంవత్సరాలుగా రొయ్యల పరిశ్రమలో ఉన్నానని, రొయ్యల పరిశ్రమ ఆటుపోటులను ఎదుర్కొంటోందన్నారు. పరిశ్రమ స్థిరత్వం పెద్దసవాలుగా మారిందని తెలిపారు. రొయ్యల పరిశ్రమలో చేపల ప్రోటీన్లను సేకరించేందుకు చెరువులలో వాడే రొయ్యల మేత తయారీలో ఉపయోగిస్తున్నామన్నారు. నాణ్యమైన చేపల ప్రోటీన్లను పొందడం తమకు చాలా కష్టంగా ఉందని, కనుక అధిక మాంసకృత్తులతో కూడిన సోయా మీల్ చేపల మేతలో కొంతమేరకు ప్రత్యామ్నాయంగా వాడుతున్నామన్నారు. రొయ్యల ఫీడ్ తయారీలో పూర్తిగా మొక్కల ఆధారిత ప్రోటీన్లను వాడేందుకు కావలసిన సాంకేతికత తాము ఎదురుచూస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఆర్‌అండ్‌డి సంస్థలు ఈ దిశగా అవసరమైన పరిశోధనలపై దృష్టి సారిస్తాయని తెలిపారు. ఈ సదస్సుకు రాజేష్ కుమార్ ఎంపి (టిఎస్), సంజీవ్ అరోరా ఎంపి (పంజాబ్), అమరేంద్ర ధరింగ్ ఎంపి (బీహార్), బినోయ్ విశ్వం ఎంపి (కేరళ), అమర్ పట్నాయక్ ఎంపి (ఒడిశా), సంజయ్ సేథి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్లాంట్ బేస్ట్ ఫుడ్ ఇండస్ట్రీ అసోసియేషన్ నేటి ఫంక్షన్‌కి ఇతర అతిథులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం ముంగమూరు గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం అదనపు సిడిపిఒ శారద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించి అంగన్‌వాడీలో కేంద్రంలోని విద్యార్థులతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకి అందిస్తున్న విద్యా సౌకర్యాలపై ఆరా తీశామని తెలిపారు. సూపర్‌వైజర్ కోటేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులున్నారు.

సభ్యులు ఎంపిక



ప్రజాశక్తి-అనంతసాగరం
హ్యూమన్ రైట్స్ అండ్ ఆప్రెస్ కంట్రోల్ జిల్లా కమిటీ సభ్యులను జాతీయ ఆర్గనైజేషన్ సెక్రటరీ బోయమద్దులేటి మధు నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007 నుండి జిల్లావ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వృద్ధులకు భోజనాలు, తల్లిదండ్రులు లేని పిల్లలకు ఆర్థికసాయం మహిళలకు టైలరింగ్ ద్వారా ఉపాధి కల్పిస్తున్నారు. గ్రామస్థాయిలో సమస్యలు పరిష్కరిస్తూ, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సమస్యలను ప్రభుత్వ అధికారులతో చర్చించారు. అనంతరం జిల్లా కమిటీ అధ్యక్షులుగా కానగల వెంకటరమణయ్య, జిల్లా ఉమెన్ ప్రొటెక్షన్ ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ చైర్మన్‌గా పెంచలమ్మను నియమించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాధ్యతలను శ్రద్ధతో నిర్వర్తిస్తామన్నారు.

'చలో మచిలీపట్నం'కు తరలిన నాయకులు



ప్రజాశక్తి-కలిగిరి : జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మచిలీపట్నంలో చేపడుతున్న 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కలిగిరి జనసైనికులు బయల్దేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ గెలవకపోయినా ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతో గత 10 సంవత్సరాలు నుంచి నిరంతరం ప్రజాపోరాటం చేస్తూ ప్రజలకు అండదండగా నిలబడుతూ చేయూతనిస్తూ ప్రజల సమస్యలే తన ధ్యేయంగా పోరాటం చేస్తున్న పవన్ కళ్యాణ్‌కి తమ మద్దతు తెలియజేయడానికి బహిరంగ సభకు బయల్దేరుతున్నట్లు నాయకులు తెలియజేశారు. కార్యక్రమంలో కార్తీక్, గణేష్, అయ్యప్ప, మదన్, హేమంత్, రవి తదితరులున్నారు.

గ్రామసింహాల స్వైర విహారం

ప్రజాశక్తి-వరికుంటపాడు : గ్రామసింహాల స్వైర విహారంతో భయాందోళనకు గురవుతున్నట్లు విరువూరు గ్రామస్తులు తెలియజేశారు. గ్రామస్తులు ఇంటి నుండి బయటకు రావడానికి, పిల్లలకు స్కూలుకు వెళ్లాలంటే కర్రలతో బయటకు వచ్చే దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి తరుణంలో గ్రామంలోని యువత ముందుకొచ్చి స్వైరం చేసిన కుక్కను కర్రలతో కొట్టి చంపి, గ్రామస్తులకు భయాందోళన నుండి విముక్తి కలిగించారు. ముఖ్యంగా చెరుకూరి తిరుపతి రెడ్డికి(65) తీవ్ర రక్తస్రావం కాగా పామూరు వైద్యశాలకు తరలించి 9 కుట్లు పడ్డట్లు గ్రామస్తులు సమాచారం. ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిందితుడి అరెస్ట్


మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకటరమణ

ప్రజాశక్తి - కావలి : కొండాపురం పోలీసుస్టేషన్ పరిధిలో యరబొట్లపల్లి గ్రామానికి చెందిన అరగ ఎస్తేరమ్మ అనే దళితయువతిని ప్రేమించి, ఆమెతో సహజీవనం చేసి, పెళ్లి చేసుకొమ్మంటే మోసం చేశాడని యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గరిమెనపెంట గ్రామం కోవివారిపల్లెకు చెందిన అగ్రకులస్థుడైన చెమ్ముపాటి మనోజ్‌కుమార్‌ను కొండాపురం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసినట్లు కావలి డిఎస్‌పి వెంకటరమణ తెలిపారు. అతనిపై యువతిని మోసం చేసినకేసుతోపాటు ఎస్.సి., ఎస్.టి., అట్రాసిటీ కేసును కూడా నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. కొండాపురం ఎస్.ఐ.షేక్.ఖాజావలి పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-కొడవలూరు : మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లును పూర్తి చేశామని కళాశాల ప్రిన్సిపల్ ఆంజనీదేవి ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయం ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి నుండి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానుండగా, ఈ ఏడాది కూడా కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ హనుమంతరావు తెలిపారు. పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని, పరీక్ష కేంద్రంలో అనంతసాగరం, మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల నుండి 225 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలలో లైవ్ స్ట్రీమ్ ఏర్పాటు చేశామని ప్రతి విద్యార్థి కదలిక పరీక్షలు రాస్తున్నారా లేదా లైవ్ స్ట్రీమ్ ద్వారా తెలుస్తుందన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సెల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవని, విద్యార్థులు 8.15గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. కళాశాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి : మండలంలోని ఏపి మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్‌లో బుధవారం జరగనున్న పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు సెంటర్ ప్రిన్సిపల్ ఎ.శ్రీను, డి ఒ షఫీ అహ్మద్, స్పెషల్ ఆఫీసర్ ఎం.వెంకటరావు తెలిపారు. మొత్తం 274 మంది విద్యార్థులు సెంటర్లో పరీక్షలు రాస్తుండగా వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు -151 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 123 మంది విద్యార్థులు ఉన్నారు. వీరుకాక ప్రయివేట్‌గా రాసే విద్యార్థులు కూడా ఉన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు మాస్క్ తప్పనిసరిగా ధరించి రావాలని, ఎవరు కూడా వారి సెల్‌ఫోన్లను లోపలకు అనుమతించబడవని కాలేజి ప్రిన్సిపల్ తెలియజేశారు.

నులిపురుగుల నివారణకు చర్యలు



ప్రజాశక్తి-సీతారామపురం : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మంగళవారం మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్స్‌లో 1 నుండి 19 19 సంవత్సరాల విద్యార్థులు అందరికీ ఆల్‌బైడోంజోల్ టాబ్లెట్స్ మింగించారు. ముందుగా విద్యార్థులకు ఎన్‌డిడి ప్రోగ్రాంపై, ఆల్‌బైండోజోల్ టాబ్లెట్స్ ఎందుకు మింగాలనే దానిపై అవగాహన కల్పించారు. రక్తహీనత రాకుండా, పిల్లలు శరీరకంగా, మానసికంగా బలంగా ఉండడానికి ఇవి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ స్వప్న, సిహెచ్ఒ, ఎంపిహెచ్ఇఒ, ఎఎన్ఎంలు, ఎంపిహెచ్ఎ, ఎంఎల్‌హెచ్ పి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-సంగం : బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణా దినోత్సవాన్ని డాక్టర్ ప్రతిమ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ పాల్గొని విద్యార్థులకు నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహనా కల్పించారు. అనంతరం విద్యార్థులకు నులి పురుగుల నివారణా మందులు పంపిణీ చేశారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా ప్రతీ 6 నెలలకొకసారి నులి పురుగుల నివారణా మందులు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మహాలక్ష్మి, వైద్యాధికారి శ్రీనివాసులు రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-కావలి : కావలి రూరల్ మండలం పరిధిలో సర్వాయపాలెం జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాలలో మంగళవారం "ప్రపంచ నులి పురుగుల నివారణ దినోత్సవం" ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అభివృద్ధి అధికారి ఎస్.కనకదుర్గ భవాని ముఖ్య అతిథిగా పాల్గొని బాలబాలికలకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షల సమయం కావున బాల బాలికలు అందరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు మనం తినే ఆహారంలో ఏదైనా కలుషిత పదార్థాలు, కాలుష్యం వల్ల నులిపురుగులు ఏర్పడతాయని వాటి వల్ల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉన్నందున నులిపురుగుల మాత్రలు వాడవల్సిందిగా బాలభాలకు సూచించారు. 0 నుంచి 5 సంవత్సరాలు బాలబాలికలు అయితే 200 మిల్లీ గ్రాముల మాత్ర వాడాలని 5 నుంచి 20 సంవత్సరం వయసు వరకు 400 మిల్లీ గ్రాముల మాత్రలు వాడాలని భోజనం చేసిన అరగంట తర్వాత ఈ మాత్రలు వేసుకోవాలని బాల బాలికలకు తెలియజేశారు. అక్కడే ఉన్న పదవ తరగతి విద్యార్థులకు ఎలా చదివి పరీక్షలు పాస్ అవ్వాలి అనేదానిపై వారికి అవగాహన కల్పించారు. మధ్యాహ్న భోజన వసతి సదుపాయం కూడా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకట సుబ్బారావు, ఎంఇఒ శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు పివి రమణ, సర్వాయపాలెం వైద్యాధికారి హరికృష్ణ, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్ : ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ వెంకటప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎసిఎస్ఆర్ కాలనీ ఎంపిపి స్కూల్ విద్యార్థులకు నులిపురుగులు నివారణకు దినోత్సవంలో భాగంగా నులిపురుగులు మందులు పంపిణీ చేశారు. అర్బన్ ప్రాంతంలో 11988 పిల్లలకు గానూ 11750 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని విద్యార్థులు రకరకాల తినుబండారాలు అధికంగా తీసుకోవడం వల్ల అందులో తీపి పదార్థాలు అత్యధికంగా తీసుకోవడం వల్ల కడుపులో నులి పురుగులు పెరగడంతో వారు తినే ఆహారం వంటికి పట్టకపోవడం వల్ల విద్యార్థులు బలహీనపడుతున్నారని తెలిపారు. అందు వల్ల నులిపురుగులు మందులు వాడితే నివారించవచ్చని తెలియజేశారు. కార్యక్ర మంలో మెడికల్ ఆఫీసర్ అర్బన్ హెల్త్ క్లీనిక్ డాక్టర్ ఎస్ కె అస్మా, ఎంపిహెచ్ఇఒ సుధాకర్ సిబ్బంది ఉన్నారు. మహిళలు పిహెచ్‌సి ఆధ్వర్యంలో డాక్టర్ రాకేష్ డాక్టర్ అనూష కుమారి ఆదేశాల మేరకు మండలంలోని స్కూల్స్ అంగన్‌వాడీ సెంటర్లలో ఉన్న 3871 మంది పిల్లలకు గానూ 362 మంది పిల్లలకు నులిపురుగులు మాత్రలు వేసి 94.6శాతం సాధించినట్లు డాక్టర్ రాకేష్ తెలియజేశారు.

ఆత్మకూరు మండలంలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎంపిడిఒ సి.శ్రీనివాసులు పాల్గొన్నారు. మండలంలోని నువ్వూరుపాడు, అశ్వనిపురం, పాత జంగాలపల్లిలోని పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు ఆల్‌బైండోజోల్ మాత్రలు ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు తమ పరిసరాల శుభ్రత, హ్యాండ్ వాషింగ్‌లపై అవగాహన కల్పించారు. అక్కడ జరుగుతున్న మిడ్ డే మీల్స్ కార్యక్రమంలో జగనన్న గోరుముద్దను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సయాధ్ జావిద్, వాసుదేవా, సంక్షేమ సహాయకులు రావూఫ్, మెడికల్ సూపర్‌వైజర్ అబ్దుల్ రహీం, ఎఎన్ఎం పద్మ, ఆశా వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.





ప్రజాశక్తి-బిట్రగుంట : జాతీయ నులిపురుగులు నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బోగోలు మండలంలో 19 సంవత్సరాల లోపు అర్హులైన పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందజేశామని మండల వైద్య అధికారిని సీమ తప్పం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోగోలు మండల పరిధిలో ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు 10,117 మంది విద్యార్థులు ఉన్నారని వారిలో 9300 మందికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్, కావలి డిప్యూటీ డిఎం ఎండి డాక్టర్ పి.బ్రిజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులున్నారు.



షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

- లక్ష రూపాయలు ఆస్తి నష్టం

ప్రజాశక్తి-కోవూరు
విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమైన సంఘటన సోమవారం కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామం తిప్ప గిరిజన కాలనీలో చోటుచేసుకుంది. వివరాల మేరకు... తలపల రాణి అనే మహిళ నివాసం ఉంటుంది. ఇంటి బయట ఉండి పనులు చేసుకుంటూ ఉండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో పూరి గుడిసె మొత్తం దగ్ధమైంది. దీంతో ఇంట్లో ఉన్న మంచాలు గృహ ఉపకరణాలు, దుస్తులు మొత్తం అగ్నికి ఆహుతయ్యాయని సుమారు లక్ష రూపాయలు వరకు ఆస్తి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పూరిల్లు కాలిపోవడంతో నిరుపేద కుటుంబం రోడ్డున పడిందని ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

పసుపు రైతులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు కాకు వెంకటయ్య

ప్రజాశక్తి-ఉదయగిరి
మెట్ట ప్రాంత పసుపు రైతులను ఆదుకోవాలని ఎపి రైతు జిల్లా రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని కృష్ణారెడ్డిపల్లి గ్రామంలో పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఆదుకోవాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మాట్లాడుతూ ఎకరంకు లక్ష 30 వేలు అనిత వడ్డీలతో అప్పు చేసి మెట్ట రైతులు పండించిన పసుపు దిగబడి చేతికొచ్చాయని సంబంధిత అధికారులు ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తక్షణ చొరవ తీసుకొని ఉదయగిరి కేంద్రానికి ఏర్పాటు చేసి దళారుల నుండి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలన్నారు. 15 రోజులు లాగా దిగబడి చేతికి వస్తుందని సంబంధిత అధికారులు స్పందించి రైతుల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం కొనుగోలు చేసేలా చూసి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ పసుపు రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలని వినతి

ప్రజాశక్తి-నెల్లూరు
రెండో నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన సచివాలయ ఉద్యోగులకు వెంటనే ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (విడబ్ల్యుఎస్‌జిఇఎ) (384/2022) జిల్లా అధ్యక్షులు షేక్.బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి, డిఆర్‌డిఎ పిడి సాంబ శివారెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో నోటిఫికేషన్‌లో ఉద్యోగాలు పొందిన వారు రెండు సంవత్సరాలు ప్రొబేషన్ పీరియడ్ పూర్తి చేసుకోవడమే కాకుండా డిపార్ట్‌మెంట్ పరీక్షలు కూడా ఉత్తీర్ణులై నెలలు గడుస్తున్నాయన్నారు. వారికి త్వరితగతిన ప్రొబేషన్ డిక్లరయ్యే అన్ని రకాల ఫంక్షనరీస్ సంబంధించిన శాఖాధిపతులకు ఉత్తర్వులు పంపాలని కోరినట్లు తెలిపారు. అలాగే సచివాలయ ఉద్యోగులకు సంబంధించిన అన్ని రకాల సెలవులను వారి లాగిన్‌లలో క్రెడిట్ చేయాలనీ రాష్ట్రస్థాయి అధికారులు ఉత్తర్వులు జారీ చేసినా ఇంత వరకు జిల్లా అధికారులు వాటిని సచివాలయ ఉద్యోగుల లాగిన్‌లలో క్రెడిట్ చేయలేదని వాటిని వెంటనే సచివాలయ ఉద్యోగుల లాగిన్‌లలో క్రెడిట్ అయ్యేలా చూడాలన్నారు. హెల్త్ సెక్రటరీలకు రెండోవ శనివారం సెలవు అయినప్పటికీ విధులు నిర్వర్తించమని ఒత్తిడి చెస్తున్నారని ఇది దారుణమన్నారు. రెండో శనివారం సెలవు ఉండే విధంగా చూడాలని లేనిచో వారికి 35 రోజులు సెలవులు వారి లాగిన్‌లో క్రెడిట్ అయ్యేలా ప్రభుత్వానికి ప్రతి పాదనలు



పంపాలని కోరామన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు పెన్షన్ మనీ విత్‌డ్రా చేసే సమయంలో మహిళా వెల్ఫేర్‌లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ సమయంలో వారికి రక్షణ ఉండేలా చూడాలని తెలిపారు. పై సమస్యలన్నీ సావధానంగా విన్న నోడల్ అధికారి సాంబశివారెడ్డి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారన్నారు. కార్యక్రమంలో విడబ్ల్యుఎస్‌జిఇఎ జిల్లా ప్రధాన కార్యదర్శి శీలం బ్రహ్మానాయుడు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్.బాబురావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇ.స్నేహ లత, ఉపాధ్యక్షులు పి.మనోజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి విజయ్ పవన్ కుమార్, నెల్లూరు నగర అధ్యక్షులు జి.మురళికృష్ణ, నగర ఉపాధ్యక్షులు వీరేంద్ర, నాయకులు శ్రావణ్, రోహిణి, మస్తానమ్మ, కరీమున్నిసా, నజీరా, స్పందన, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-ఉదయగిరి
ఎన్‌టిఆర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ఉదయగిరి టిడిపి నేతలు అందజేశారు. మంగళవారం స్థానిక చెంచలబాబు యాదవ్ అతిథి గృహంలో ఎన్‌టిఆర్ క్రికెట్ టోర్నమెంట్ బహుమతులను మండల టిడిపి నాయకులు విజేతలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ ఎంఎల్ఎ బొల్లినేని వెంకట రామారావు, మాజీ జెడ్‌పి చైర్మన్ టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చెంచలబాబు యాదవ్ సూచనలతో ఈ బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. మొదటిగా నిలిచిన దిలావర్ బావి వీధి టీముకు రూ.50,116 లను బొల్లినేని వెంకట రామారావు, రెండవ బహుమతి స్థానిక యాదవ్ వీధి టీముకు రూ.25,116 చెంచల బాబు యాదవ్, మూడవ బహుమతి వెంకట్రావు పల్లి టీముకు రూ.15,116 కంచర్ల శ్రీకాంత్ నగదు ఇచ్చారన్నారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ సయ్యద్ జాఫర్ మోదిన్



నగదు సహకారం అందజేశారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బయన్న, బొజ్జ నర్సింహులు వెంకటస్వామి, మాబాషా, సంధాని, కాంతారావు, శివకృష్ణ పాల్గొన్నారు.

అడ్డదారుల్లో గెలవడం సిగ్గుచేటు..


మాట్లాడుతున్న చెంచలబాబుయాదవ్

ప్రజాశక్తి-ఉదయగిరి
6, 7, 10 తరగతుల వారితో అడ్డదారులు తొక్కుతూ వైసిపి ప్రభుత్వం గెలవడం సిగ్గుచేటని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జెడ్‌పి మాజీ చైర్మన్ పి.చెంచల బాబు యాదవ్ విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇలాంటి అక్రమ అరాచక రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసం కోల్పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరిగిన ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో భారీగా దొంగ ఓట్లు నమోదు చేసుకుని వేసుకోవడం ఎంతవరకు సమంజసమని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనపై అన్ని వర్గాలలో పూర్తి వ్యతిరేకత ఉందని ఎప్పుడు ఎన్నికలు జరిగిన ఈ ప్రభుత్వాన్ని దించేందుకు సిద్ధంగా ఉన్నారని ధ్వజమెత్తారు. దొడ్డి దారిన ఎన్నికల్లో గెలవాలనుకోవడం సిగ్గుచేటన్నారు. దొంగ ఓట్లు నకిలీ ఓట్లతో గెలవాలని పిరికిపంద చర్యని ఆయన అభివర్ణించారు. 6, 7, 10 తరగతి చదివిన వారు పట్టభద్రులుగా దొంగ ఓట్లు అనేకమంది నమోదు చేసుకుని ఓటర్లుగా దొంగ ఓట్లు పోల్ చేస్తుంటే ఎన్నికల కమిషన్ ప్రేక్షకు పాత్ర పోషించడం వారి హక్కులను కాలరాయడం దుర్మార్గమైన చర్య అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తమకు అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఉన్న దశ్య పట్టబద్దులు ఉపాధ్యాయులు తమ ప్రభుత్వానికి మద్దతు తెలపరని దొంగబట్లతోనైనా పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎంఎల్‌సి ఎన్నికలలో విజయం సాధించాలని అడ్డదారులు విజయం సాధించడం విడ్డూరంగా ఉందన్నారు. వైసిపి బలపరిచిన అభ్యర్థులకు రామన్న ఫలితాలలో తగిన గుణపాఠం చెబుతారని టిడిపి బలపరిచిన అభ్యర్థులకు విజయం తథ్యమన్నారు.


సంచులు పంపిణీ చేస్తున్న ఫాస్టర్ స్టీఫెన్

జనుపనార సంచులు పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
ఆత్మకూరు పట్టణంలోని టిడ్కో భవనంలో ఎడ్నమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ ఆత్మకూరు వారి సహకారంతో జనపనార సంచులను మంగళవారం ఫాస్టర్ స్టీఫెన్ 35 మందికి పంపిణీ చేశారు. ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక నష్టాలు నష్టాలు ఉన్నాయని ఒకపక్క ప్రభుత్వం ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేయాలని పదేపదే చెబుతుందన్నారు. ప్లాస్టిక్ నిషేధించిన నేపథ్యంలో ప్రజల అవసరం నిమిత్తం ఫౌండేషన్ పేరు రాసి ఉన్న జనపనార సంచులను పంపిణీ చేశారు. ఈ సంచులను తమ అవసరాల నిమిత్తం వాడడానికి పంపిణీ చేయడం జరిగిందని ఫౌండేషన్ కార్య నిర్వాహకులు పి.ఎడ్వర్డ్ తెలిపారు.